విశాలాంధ్ర
విజయనగరం
సోమవారం 13, అక్టోబర్ 2025

నూతన కమిటీలను ప్రకటించిన ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: విజయనగరం పార్టీ కార్యాలయంలో ఆదివారం విజయనగరం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు హాజరై పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా పట్టణ మరియు మండల పార్టీ నూతన కమిటీలను శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు ప్రకటించారు. పట్టణ మరియు మండల పార్టీ అధ్యక్షులుగా గంటా రవి, గంటా పోలినాయుడుని, ప్రధాన కార్యదర్శులుగా పీతల కోదండరామ్, పాశి అప్పలనాయుడుని నియమించారు. అదేవిధంగా నియోజకవర్గ, పట్టణ మరియు మండల అనుబంధ కమిటీలను కూడా ఈ సందర్భంగా ప్రకటించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నేతలను ఎమ్మెల్యే అభినందిస్తూ పార్టీ బలవరచడంలో కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ లో
ప్రజా సమస్యల పరిష్కార వేదిక

– మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలి

– కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: సోమవారం ఉదయం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. రామ సుందర్ రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని చెప్పారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోను చెక్ చేసుకోవచ్చన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో అందజేస్తున్నామని, ఎండార్స్మెంట్ ను రిజిస్టర్ పోస్ట్ ద్వారా సంబంధిత చిరునామాకు పంపిస్తున్నామని చెప్పారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలి

అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలనువినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్సైట్ ను సంప్రదించవచ్చని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

నకిలీ మద్యం కేసులో

అడ్డంగా దొరుకుతున్న కూటమి ప్రభుత్వ నేతలు

○దోచుకోండి... దాచుకొండి.. అన్నరీతిలో కూటమి

○నకిలీ వ్యవహారంపై నేటి నుండి వైసీపీ నిరసనలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: నకిలీ మద్యం కేసులో అడ్డంగా రోజురోజుకు కూటమి ప్రభుత్వ నేతలు బయటపడుతున్నారని, దోచుకోండి దాచుకోండి అన్న రీతిలో కూటమిప్రభుత్వం వ్యవహరిస్తుందని, గతంలో ఎన్నడూ లేని విధంగా విజయనగర ఉత్సవాలను నిర్వహించారని, నకిలీ మద్యం వ్యవహారంపై నేటి నుండి వైసీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపడుతున్నామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శీను) అన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదవాళ్లు తాగే మద్యాన్ని టార్గెట్ చేసి తెలుగుదేశం ప్రభుత్వం నకిలీ మద్యం ఫ్యాక్టరీలు నడుపుతోందని, నకిలీ మద్యం తయారీకి స్పిరిట్ సప్లై చేసిన వ్యక్తిని ఇంత వరకూ పట్టుకోలేదు సరి కదాఇదంతా నడింపించిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జయచంద్రారెడ్డిని ఇంతవరకూ అరెస్ట్ చేయలేదన్నారు.నకిలీ మద్యం కేసులో తెరవెనుక ఉన్న వాళ్లంతా తెలుగుదేశం పార్టీ వారేనని ఆరోపించారు.రాష్ట్రంలో అక్రమ సంపాదన కోసం నకిలీ మద్యం తయారీ ప్రారంభించారనిఅమాయక ప్రజల ప్రాణాలు హరించే హక్కు కూటమి ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ఈ నకిలీ మద్యం తయారీ సీఎం చంద్రబాబు సొంత జిల్లాలో జరిగిన ఆయన పట్టించుకోకపోవడం ఆశ్చర్యాన్ని గురిచేస్తుందన్నారు.కుటీర పరిశ్రమలాగా నకిలీ మద్యాన్ని తయారీ చేపట్టారననకిలీ మద్యం బాగోతం బయట పడ్డాక కొత్త డ్రామాలకు తెర లేపుతున్నారన్నారు. ఈ మాఫియా కేవలం మూడు నాలుగు ప్రాంతాలకే పరిమితం కాలేదని,అసలు మద్యం బాటిల్స్ ను పోలినట్లుగా తయారీ చేయడం వెనుక అధికార పెద్దల హస్తం ఉందన్నారు.ఇలాంటి మాఫియా పనులులో టిడిపి ప్రభుత్వం ఆరి తేరి పోయిందన్నారు. మా హయాంలో ప్రభుత్వమే మద్యం షాపులు నడిపామని క్యూఆర్ కోడ్ ద్వారా నాణ్యమైన మద్యం అమ్మకాలు జరిపామన్నారు.

ప్రస్తుతం జరుగుతున్న నకిలీ మద్యం వ్యవహారంపై నేటి నుండి వైసీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. వైసీపీ హయాంలో స్థాపించిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధపడడం పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేయడమే నన్నారు. వైసీపీ హయాంలో ఎంతోమంది ఉన్నత విద్యను ఉచితంగా పొందారన్నారు. ఇప్పటికే విద్యను వైద్యాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తుందన్నారు. ఇటీవల ఉత్తరాంధ్ర పర్యటనకు విచ్చేసిన జగన్మోహన్ రెడ్డికి విశేష ప్రజా ఆదరణ లభించిందన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. ఆరోగ్యశ్రీ ప్రస్తుతం అమలు కాక అనేకమంది రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాజ్యాంగంలో విద్య, వైద్యం ఉచితంగా ప్రజలకు అందజేయాలని అప్పటి రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ పొందుపరచడం జరిగిందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తే, ఉచితంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని తెలుసుకోవాలన్నారు. ప్రజా వైద్యం ప్రజల హక్కు అన్నారు. ఇక విజయనగరం సాంస్కృతిక, సాంప్రదాయాలను వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన ప్రజలకు తెలిపేందుకు ఏర్పాటుచేసిన విజయనగర ఉత్సవాలపై ప్రస్తుతం వచ్చిన ఆరోపణలు గతంలో ఎన్నడూ లేవన్నారు. అధికారులు నేరుగా నిధులు ఏ విధంగా సేకరించారో తెలపాలన్నారు . గతంలో ప్రజా ప్రతినిధులు వారి అనుచరులు స్వచ్ఛందంగా విరాళాలు ఇవ్వడమే తప్ప అధికారులను ఇబ్బంది పెట్టడం లేదన్నారు. దీనిపై పూర్తిస్థాయి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవానికి సర్వం సిద్ధం

నేడే ట్రైల్ రన్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి సిరిమాను పండుగ అనంతరం మంగళవారం వస్తున్న తెప్పోత్సవానికి సర్వం సిద్ధంచేసినట్టు ఆలయ కార్య నిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెప్పోత్సవానికి తరలివచ్చే భక్తులకు ఎటు వంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేశామన్నారు. పోలీస్, ఫిషరీస్, మున్సిపాలిటీ, ఫైర్‌తదితర శాఖల సమన్వయంతో ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించేలా చూస్తామన్నారు. నేడు పెద్ద చెరువు వద్ద ట్రయల్ రన్ నిర్వహిస్తామన్నారు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో వేదపండితుల వేదమం త్రోచ్చారణలతో వేదస్వస్థ ఉంటుందని చెప్పారు. అనంతరం స్తపన మందిరంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు ఉంటాయని తెలిపారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ అర్చకులు ఏడిద వెంకటరమణ, వేదపండితుల సహ కారంతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టుకుని ఆలయం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేసి ఆలయం బయట పుష్పాలం కరణలో సిద్ధం చేసిన రథంపై ఆశీనులు చేస్తా రన్నారు. అక్కడ నుంచి భాజాభజంత్రీలతో సున్నం బట్టీవీధి మీదుగా పెద్దచెరువు వద్దకు తీసుకువచ్చి అమ్మవారిని హంసవాహనంపై ఊరే గింపు ఉంటుందన్నారు. సాయంత్రం 5గంటల నుంచి అమ్మవారు హంస వాహనంపై పెద్దచెరువులో మూడుసార్లు విహరిస్తారని తెలిపారు. అమ్మ వారు విహరించే హంసవాహనంలో 20మందికే అవకాశం ఉంటుందని, మిగతావారి కోసం ప్రత్యేక బోట్లను ఏర్పాటు చేశామన్నారు. 30 మంది వరకూ గజఈతగాళు హంసవాహనం చుట్టూ తెప్పలపై ఉంటారన్నారు. ఫైర్ సిబ్బంది లైఫ్ జాకెట్లు, హస్కా లైట్లను ఏర్పాటుచేస్తారని తెలియజేశారు. భారీ ఎత్తున బాణాసంచా పేల్చేందుకు నిపుణు లను ఏర్పాటుచేశామన్నారు. భక్తులందరూ. మంగళవారం జరిగే తెప్పోత్సవంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

లోకేశ్వరరావు, హర్షవర్ధన్, మోహన్‌లకు ప్రధాన బహుమతులు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: అక్టోబర్ 11, 12 తేదీల్లో నిర్వ హించిన ఓపెన్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఈ పోటీల్లో సుమారు 100మంది క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శిం చారు. ప్రధాన విభాగంలో లోకేశ్వరరావు మొదటి స్థానం, హర్షవర్ధన్ యాదవ్ రెండవ స్థానం, మోహన్ బోండా మూడవ స్థానాలను సాధించారు. వీరికి రూ.15,000 నగదు బహుమతులు అందజేయ బడ్డాయి. అదేవిధంగా అండర్-07, అండర్-09, అండర్-11, అండర్-13, అండర్-15 వయో విభాగాల్లో టాప్ త్రీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ డి. ప్రభాకర్ రావు మరియు కె.వి. జ్వాలాముఖి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు విజేతలను అభినందిస్తూ, చెస్ క్రీడను మరింత అభివృద్ధి చేయాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు.

సాయి శ్రీ బ్యూటీ పార్లర్ ప్రారంభోత్సవంలో వైసీపీ జిల్లా జనరల్ సెక్రెటరీ వేణు గోపాల నాయుడు

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణం బలిజి పేట రోడ్ బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదురుగా సాయి శ్రీ బ్యూటీ పార్లర్ ప్రారంభోత్సవం కార్యక్రమం బ్యూటీపార్లర్ మేనేజింగ్ డైరెక్టర్ శంబంగి రమా ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైయస్సార్ కాంగ్రెసు పార్టీ జిల్లా వైసీపీ జనరల్ సెక్రెటరీ శంబంగి వేణు గోపాలనాయుడు పాల్గొని ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ మహిళా జాయింట్ సెక్రెటరీ తూముల అచ్చుతావల్లి తదితరులు పాల్గొన్నారు.

శీ వాసవి నిత్యనిర్మల యోగా పీఠం వార్షికోత్సవం

విశాలాంధ్ర-గరివిడి: గర్భాంరోడ్‌లో శ్రీ వాసవి నిత్యనిర్మల యోగా పీఠం 20వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా యోగా గురువులు అల్లం కనకేశ్వరరావు, ఎ.సత్యశ్రీనివాసులను యోగా సభ్యులు, ఆహ్వానితులు, అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి రిటైర్డ్ ఎంఈఓ. జె. మహాలక్ష్మి నాయుడు అధ్యక్షత వహించారు. సభలో వక్తలు బమ్మిడి కార్తీక్, వి.వి.ఎస్.ఎన్. గుప్తా, శివుకు కాంతారావు, ఓం శాంతిలత అక్కయ్య, సయ్యద్ గఫార్, అమరా సతీష్, మానవీయత సంఘ అధ్యక్షులు గోవిందరాజులు యోగా ప్రాముఖ్యతపై ప్రసంగించారు. యోగాసభ్యులు జి.ఆర్.ఎల్. లావణ్య, అంబల్ల గౌరునాయుడు తమ యోగా అనుభవాలను పంచుకున్నారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న వాసవి నిత్యనిర్మల యోగా పీఠం భవన్ స్థల దాత, గరివిడి జడ్పిటిసి సభ్యులు వాకాడ శ్రీనివాసరావు మాట్లాడారు.

పూర్వ విద్యార్థులు అపూర్వ కలయిక

విశాలాంధ్ర-మెరకముడిదాం: మూడు దశాబ్దాల క్రిందట వారంతా ఒకే బడిలో కలిసి చదువుకున్నారు. చదువులమ్మ తల్లి ఒడిలో ఆటపాటలతో గడిపారు. ఇప్పుడు పెద్దవారై దేశ విదేశాల్లో వివిధ రాష్ట్రాల్లో, వృత్తిరీత్యా స్థిరపడ్డారు. తామంతా ఒకసారి కలుద్దామని మూడు నెలల క్రిందట నిర్ణయం తీసుకున్నారు. నిర్ణయం తీసుకున్నదే తడవుగా అహోరాత్రులు శ్రమించి స్నేహితుల ఫోన్ నెంబర్లు సేకరించి అంతా తాము చదువుకున్న పాఠశాలలో కలుద్దామని అనుకున్నారు. వీరంతా కలిసిన అపూర్వ ఘట్టం ఆదివారం గర్భాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. వివరాల్లోనికి వెళ్ళగా మండలంలో గర్భాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992- 93 సంవత్సరంలో వీరంతా కలిసి పదవ తరగతి చదువుకున్నారు. ఆదివారం ఉదయం పూర్వ విద్యార్థులంతా పాఠశాలకు చేరుకున్నారు. ఒక్కసారి ఒకరినొకరు చూసి 30 సంవత్సరాలు అయ్యేసరికి ఒరేయ్ నువ్వు స్వామి నాయుడు కదా, ఒరేయ్ నువ్వు శంకర్ కదా, ఒరేయ్ నువ్వు నరసింహులు కదా అని ఒకరినొకరు హత్తుకొని ఆనందభాష్పాలతో కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం వీరు చదువుకున్న పాఠశాల తరగతి గదిలోకి వెళ్లి ఒక్కసారి పదవ తరగతి చిన్న పిల్లల్లా మారిపోయారు. ఒకానొక సందర్భంలో వారి వృత్తుల్ని స్థాయిలని మరిచి ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులు రంప సత్యనారాయణ, రామారావు, సర్వేశ్వరరావు మరియు నాన్ టీచింగ్ స్టాఫ్ అయిన సిరిపరపు రాముని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పల్లేడ స్వామి నాయుడు, సావు శంకరరావు, నరసింహులు, 55 మంది పూర్వ విద్యార్థులుపాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో పారిశుధ్య కార్మికుల కృషే కీలకం

స్వచ్ఛ వారియర్ నాగరాజుకు ఘన సత్కారం

విశాలాంధ్ర-బొబ్బిలి: స్వచాంధ్ర విజయ వంతమవటానికి పారిశుధ్య కార్మికుల భాగస్వామ్యమే ప్రధానమని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె సి రాజు అన్నారు ఆదివారం స్థానిక కారుణ్య కార్యాలయం లో ఇటీవల స్వచాంధ్ర అవార్డుల జిల్లా స్థాయిలో మంత్రుల చేతుల మీదుగా స్వచ్ఛత వారియర్ అవార్డ్ అందుకున్న బొబ్బిలి పురపాలక సంఘానికి చెందిన బంగారి నాగరాజును కారుణ్య సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనను పట్టు కండువాతో సత్కరించి నూతన వస్త్రాలను బహుకరించారు. ఈ సందర్భంగా జె సి రాజు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు వారి జీవితాలను పణంగా పెట్టి ప్రతిరోజు విధులు నిర్వహిస్తున్నారన్నారు. పట్టణ పుర ప్రజలు ఆరోగ్యం గా ఉండటానికి ప్రధాన కారకులు పారిశుధ్య కార్మికులే అన్నారు వారిని గౌరవించుకోవాల్సిన భాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో కారుణ్య ప్రతినిధులు ఏ చిన్నారావు, జి సిహెచ్ జి శర్మ, సోమేశ్వర రావు కె రామ కృష్ణ, కృష్ణ మోహన్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలి

జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఐక్యవేదిక విన్నపం

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: విజయనగరం నియోజకవర్గాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా నడిపించాలని జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఐక్యవేదిక నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం 12 గంటలకు టిడిపి పార్టీ అశోక్ బంగ్లాలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు జిల్లాలో జరుగుతున్న ఉత్సవాలను అభినందిస్తూ విజయనగరం ఎమ్మెల్యే అతిథి విజయలక్ష్మి గజపతి రాజుకి సన్మానం చేశారు. సభలో చోడి ఆదినారాయణ, ఇప్పిలి వెంకట రామారావు, కుందేటి పార్వతి, ఎస్. ఆదిలక్ష్మి తదితరులు మాట్లాడుతూ జిల్లాలో బలహీన వర్గాలకు కేటాయించిన ఇళ్ల అసంపూర్ణంగా ఉన్నాయని, రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం ఐటీ మరియు పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, త్రాగునీరు, సాగునీరు ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేస్తే వ్యవసాయం, పరిశ్రమలు అభివృద్ధి చెంది వలసలు తగ్గుతాయని సూచించారు. విద్య, వైద్యం రంగాల అభివృద్ధికి ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలని కూడా వారు కోరారు. జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి విజయ నగరాన్ని రాష్ట్రంలో నంబర్ వన్ జిల్లాగా తీర్చిదిద్దాలని ఐక్యవేదిక నాయకులు విన్న వించారు. ఈ కార్యక్రమం లో కొల్లేటి శ్రీను, కే. పైడిరాజు, కే. గణేష్, సలాది అప్పలస్వామి, ఎస్. తారకేశ్వరరావు, మలిచర్ల గణేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న పెను ప్రమాదం

ఏ క్షణానైనా కూలే పరిస్థితిలో విద్యుత్ స్తంభం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మండలంలోని పెద్దఖండేపల్లి గ్రామ పంచాయతీ బీసీ కాలనీ శివారు వీధిలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదానికి ఆహ్వానంగా మారింది. వర్షాలుపడే సమయంలో స్తంభానికి విద్యుత్ లీక్ అవుతుందనే విషయాన్ని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు నివాసితులు తెలియజేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.ఫలితంగా రోడ్డు మీదుగా వెళ్తున్న పిల్లలు, పెద్దవారు అనుకోకుండా స్తంభాన్ని తాకి విద్యుత్ షాక్‌కు గురవడం వంటి ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం ఆ స్తంభం పూర్తిగా శిథిలావస్థకు చేరి, కొట్యడ శంకర్ ఇంటి మీదకు వాలి ఉంది. ఏ క్షణాన కూలిపోతుందోనని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. "గత రెండు సంవత్సరాలుగా విద్యుత్ శాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు అనేకసార్లు తెలిపినా ఎవరూ పట్టించుకోలేదు," అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాన్ని తొలగించి పక్కనే ఖాళీ స్థలంలో ఏర్పాటు చేస్తే, ప్రజల ప్రాణాలు రక్షించబడతాయని నివాసితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డేటా సెంటర్ల హబ్ తో మన నిరుద్యోగ యువతకు కొలువులు

కూటమి ప్రభుత్వంలో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయి....

టీడీపీ యువ నాయకులు, రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లిక నాయుడు ప్రజలు

విశాలాంధ్ర-చీపురుపల్లి : విశాఖపట్నం విచ్చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి కమిటీ రామ్ మల్లిక నాయుడు కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన చరవాణి ద్వారా లేఖలతో మాట్లాడారు.. తరతరాల భవితకు బంగారు బాట వేసిన మంత్రి నారా లోకేష్ నకు తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక నాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయని. విశాఖ డేటా సెంటర్ల హబ్ గా రూపుదిద్దుకోనుందని. విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ..శరవేగంగా అడుగులు పడుతున్నాయి కిమిడి అన్నారు.ఏఐ ఆధారిత డేటా సెంటర్ రాక వల్ల భారతదేశ తదుపరి గ్లోబల్ డిజిటల్ గేట్ వేగా విశాఖ రూపుదిద్దుకోనుంది అని తెలిపారు. సముద్రపు కేబుల్ కనెక్టివిటీ, ఏఐ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయనుంది అన్నారు.. రాష్ట్రంలో సాంకేతిక రంగం అభివృద్ధిలో భాగంగా విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, నాస్ డాక్ లో నమోదైన దేశ ప్రముఖ డిజిటల్ ఐసీటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ సిఫీ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్(Sify Infinit Spaces Limited) నిర్మించబోయే 50 మెగావాట్ల ఏఐ ఆధారిత ఎడ్జ్ డేటా సెంటర్ తో పాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ కు ఈరోజు నారా లోకేష్ శంకుస్థాపన చేశారు అని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 3.6 ఎకరాల భూమిలో రూ.1500 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్ ను సిఫీ అభివృద్ధి చేయనుంది అన్నారు. తద్వారా మన ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి అని తెలిపారు . నూతన కేబుల్ ల్యాండింగ్ స్టేషన్(%జూరా%) సదుపాయం వల్ల సముద్రపు కేబుల్ కనెక్టివిటీని మెరుగువరుస్తూ.. ఎడ్జ్ స్థాయిలో ఏఐ కంప్యూటింగ్ సామర్థ్యాన్ని విస్తరించే అవకాశం కల్పిస్తుంది అన్నారు. భారతదేశంతో పాటు ఆగ్నేయాసియాలోని సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా, థాయ్ లాండ్ వంటి దేశాల మధ్య త్వరితగతిన డేటా ప్రాసెసింగ్ చేస్తూ విశాఖ సీఎల్ఎస్ వ్యూహాత్మక ల్యాండింగ్ పాయింట్ గా పనిచేస్తుంది అని కిమిడి రామ్ మల్లిక్ నాయుడు తెలిపారు.

జగదాంబ నగర్ లో బంగారం చోరీ

విశాలాంధ్ర-గంట్యాడ : గంట్యాడ మండలం కరకవలస పంచాయతీ జగదాంబ నగర్ లో నివాసం ఉంటున్న కుప్పిలి శ్రీరామ్ మూర్తి రిటైర్డ్ టీచర్ అనే అతని ఇంటిలో వారు లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోనికి ప్రవేశించి బీరువాలోని ఒకటిన్నర తులాల గొలుసు,పావు తులం ఉంగరం మొత్తం తులం ముప్పావు బంగారం దొంగతనం చేయడం జరిగింది. దీనిపై ఆయన ఇచ్చిన ఫిర్యాదు పై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి దర్యాప్ చేయడం జరుగుతుందని గంట్యాడ ఎస్సై సాయి కృష్ణ తెలిపారు.

స్వాములకు మాలాధారణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్ తదితర ప్రాంతాలకు అయ్యప్ప స్వాములను పరిచయం చేసిన దివంగత నారాయణ గురు స్వామి ఇంటిలో ఆదివారం స్వాములకు మాలాధారణ వెంకటేష్ గురు స్వామి చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తమ పెదనాన్న నారాయణ గురు స్వామి, పరమేశ్వర గురుస్వామి చేతులమీదుగా ఎంతోమందికి మాలాధారణ కార్యక్రమం జరిగిందన్నారు. ప్రస్తుతం వారి ఆశీస్సులతో మాలాధారణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రతాప్ గురుస్వామి, శంకర్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

కళింగ వైశ్య సంఘం అధ్యక్షులుగా గెంబలి శ్రీనివాసరావు ఎన్నిక

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణ కళింగ వైశ్య సంఘం అధ్యక్షునిగా మళ్ళీ ఎన్నికైన పట్టణ టీడీపీ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు గెంబలి శ్రీనివాసరావు ను కళింగ వైశ్య సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కళింగ వైశ్య సంఘం అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని సంఘ సభ్యులకు హామీ ఇచ్చారు.

జీఎస్టీ పన్ను తగ్గింపు పచ్చి మోసం : సిపిఎం

విశాలాంధ్ర-బొబ్బిలి : 2017 జూలై 1 నుండి రాష్ట్రాలలో ఉన్న పన్నులు రద్దుచేసి ఒకే దేశం ఒకే పన్ను అని చెప్పి రాష్ట్రాల హక్కులు కలరాస్తూ జీఎస్టి పన్ను విధానం మతోన్మాద బిజెపి ప్రభుత్వం అమలు చేసిందని. ఈ 8 సంవత్సరాల కాలంలో దేశంలో ప్రజలందరి మీద సుమారు 30 లక్షల కోట్ల రూపాయలు వసూలు చేశారని. ప్రజల రక్తమాంశాలు పీల్చి పిప్పి చేశారని. ప్రాణాంతక వ్యాధులైన హార్ట్ఎటాక్, క్యాన్సర్ లాంటి జబ్బులకు వాడే మందులు మీద 24 శాతం పన్ను వేశారని సిపిఎం నాయకులు పి శంకర్రావు కేంద్ర ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. చిన్నపిల్లల వాడే పెన్సిల్ మీద ఐదు శాతం పన్ను వేసి.ఒకే దేశం ఒకే పన్ను భారం భరించలేక ప్రజలు బిజెపి ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతుందని. బీహార్లో ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని జీఎస్టీ పన్ను తగ్గింపు 15 వేల రూపాయలు- ఆదా అవుతుందని పెద్ద ఎత్తున ఉద్యోగులతో ప్రచారం చేయడం పచ్చి మోసం, బిజెపి మోసాన్ని రాష్ట్ర ప్రజలకు చెప్పాల్సిన టిడిపి కూటమి ప్రభుత్వం బిజెపి ప్రభుత్వానికి భజన చేస్తుందని సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. శంకర్రావు ఆరోపించారు . బిజెపి ప్రభుత్వం ఈ 8 సంవత్సరాల కాలంలో దేశ ప్రజలపై జీఎస్టి పన్ను ద్వారా అక్రమంగా జీఎస్టీ పన్ను వసూలు చేశామని దేశ ప్రజలను క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జీఎస్టీ పన్ను తగ్గింపు ప్రచారం చేసుకుంటున్న ఈ సమయంలో కూడా ప్రజలు వాడే నిత్యవసర వస్తువులపై జీఎస్టి పన్ను తగ్గించలేదని అన్నారు. నిత్యవసర వస్తు ధరలు తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం నాయకులు వి. శేషగిరి పాల్గొన్నారు.

మన ఊరు గ్రౌండ్ కు మంచి రోజులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: పట్టణములోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన మన ఊరు మన గ్రౌండ్ కార్యక్రమంతో గ్రౌండ్ కు మంచి రోజులు వచ్చినట్లు అయిందని డాక్టర్ చిప్పాడ శేషగిరిరావు, బొబ్బిలి రామకృష్ణ లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో గల ప్రభుత్వ మైదానంలో వాకాడ బాలు ఆధ్వర్యంలో న్యూల్ కమిటీ చైర్మన్ జె నాగేశ్వరరావు అధ్యక్షతన న్యూల్ ప్లే గ్రౌండ్ అభివృద్ధి గూర్చి సమావేశం నిర్వహించడం జరిగిందని ఈ సమావేశమునకు పట్టణానికి చెందిన గ్రామ యువకులు మేధావులు పత్రిక ప్రతినిధులు సుమారు 100 మంది హాజరై వారి వారి అభిప్రాయాలు తెలియజేశారు తదనంతరం కమిటీ ఫార్మేషన్ నిమిత్తం సమావేశంలో 8 మంది స్వచ్ఛందంగా తమ పేర్లు ఇవ్వడం జరిగినది తెలిపారు అనంతరం కాలేజీ గ్రౌండ్ లో పిచ్చి మొక్కలను తొలగించి శ్రమదానం చేశారు ఈ కార్యక్రమంలో దొడ్డి నూర్యారావు, రిటైర్డ్ టీచర్ వై వెంకట్రావు, న్యూల్ అటెండర్ గురు నాయుడు వట్టణ ప్రముఖులు యువకులు, మేధావులు పాల్గొన్నారు.

రాష్ట్ర రైతు ప్రతినిధులను
అవమానించడం హేయం

చల్లా జగన్

విశాలాంధ్ర- శృంగవరపుకోట: రాష్ట్ర రైతు ప్రతినిధులను పోలీసులు అవమానించడం హేయమైన చర్య అని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు.మాజీ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు కన్వీనర్గా ఉన్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వాన్ని విజయనగరం జిల్లా పోలీసులు రోడ్డుపై ఉంచడం ప్రజాస్వామ్య అవమానమని ఆయన అన్నారు. 82 ఏళ్ల వయస్సులో వీల్చైర్పై ప్రజల కోసం పనిచేస్తున్న వృద్ధ నేతను రోజంతా రోడ్డుపై నిలిపివేయడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజును కూడా నడిరోడ్డుపై కూర్చోబెట్టడం దురదృష్టకరమని తెలిపారు. జిందాల్ పరిశ్రమ ప్రాంతంలో భూదోపిడీకి గురవుతున్న దళిత%-%గిరిజన నిర్వాసితులను పరామర్శించడానికి వచ్చిన రాష్ట్ర, జాతీయ నాయకులను "ఉగ్రవాదులుగా" చూడడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని చల్లా జగన్ విమర్శించారు.114 రోజులుగా జిందాల్ ప్రాంతంలో కొనసాగుతున్న పోలీసు నిర్బంధం దేశంలో ఎక్కడా లేదని పేర్కొన్నారు. నిర్వాసితుల భూములను యం ఎస్ యం ఇ పేరుతో ఆక్రమించడం ఆపి, జీవో నం.14 రద్దు చేసి భూములను తిరిగి వారికి ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో కల్తీ మద్యం పై సీబీఐ విచారణ జరిపించాలి

జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష

విశాలాంధ్ర-చీపురుపల్లి : రాష్ట్రంలో ఇటీవల వెలుగు చూస్తున్న కల్తీ మద్యం వ్యవహారంపై సిబిఐ విచారణ జరిపించాలని చీపురుపల్లి జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష డిమాండ్ చేశారు.. ఆదివారం ఆమె తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన పత్రికా సమావేశంలో మాట్లాడారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైస్సార్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు...లి శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ , జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా వైస్సార్ పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, వైస్సార్ పార్టీ పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నకిలీ మద్యంపై ఆందోళన చేపట్టనున్నామని ఆమె తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసలు మద్యం బాటిల్స్ ను పోలిన విధంగా కల్తీ మద్యం బాటిళ్లను తయారు చేయడం వెనుక తెలుగుదేశం పెద్దల హస్తం వుంది అని ఆమె అన్నారు, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం లో ప్రభుత్వం నాణ్యత గల మద్యంషాప్ లు నడిపిందని క్యూ ఆర్ కోడ్ ద్వారా మద్యం అమ్మకాలు జరిగాయి అని ఆమె అన్నారు.. రాష్ట్రంలో బెల్ట్ షాప్ లు పై చర్యలు తీసుకోవడం లేదన్నారు. బెల్ట్షాప్ లు ఎమ్మెల్యే ల కనుసన్నల్లోనే వారి అనుచరులు ఆధ్వర్యంలో నడుస్తున్నాయి అని ఆమె అన్నారు. ప్రతి జిల్లాలో నకిలీ మద్యం పెద్ద ఎత్తున అమ్ముతున్నారు అని తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమలాగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కూడా తయారుచేసి ప్రజల ప్రాణాలని హరిస్తున్నటువంటి పరిస్థితుల్లో నెలకొన్న అన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 13.10.2025 (సోమవారం) ఉదయం 10 గంటలకు చీపురుపల్లి మేజర్ పంచాయతీ ఆఫీస్ నుంచి ర్యాలీ గా బయలు దేరి ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి స్టేషన్ ఆఫీసర్ కి వినతిపత్రం అందజేసే కార్యక్రమం లో చీపురుపల్లి నియోజకవర్గం ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్ లు, ఎంపీటీసీ లు వివిధ పార్టీ పదవుల్లో వున్న నాయకులు, అభిమానులు, మహిళలు,పెద్ద ఎత్తున అందరుపాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చెయ్యాలని,ఈ పత్రికా సమావేశంలో జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష తెలియజేసారు.

పి.ఆర్. ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవంతంగా నిర్వహణ

విశాలాంధ్ర-విజయనగరం: పి.ఆర్. ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సి.హెచ్. మహంతి, రాష్ట్ర కోశాధికారి జి. వెంకటరెడ్డి, గౌరవాధ్యక్షులు షేక్ రియాజ్ తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. సమావేశాన్ని విజయనగరం జిల్లా అధ్యక్షులు ఎం. సోములు, కార్యదర్శి కె. ప్రసాద్, కోశాధికారి వి. నీరజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి కె.సి.హెచ్. మహంతి అసోసియేషన్ గత సంవత్సరపు కార్యకలాపాల నివేదికను సమర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గం తరపున అనేక ముఖ్యమైన అంశాలపై చర్చించబడింది. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం కింద ఇంజనీరింగ్ విభాగం పాత్రను బలోపేతం చేయడం,విజిలెన్స్ %ం% ఎన్ఫోర్స్మెంట్ విభాగంలో ఎదురవుతున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించడంపై చర్చించారు.సిబ్బంది సర్వీస్ రూల్స్ రూపకల్పన మరియు సవరణలకు సంబంధించిన సూచనలు, ఇంజనీర్లకు తగిన ప్రమోషన్లు, బదిలీలు మరియు సేవా పరిరక్షణ అంశాలపై సవివరంగా చర్చించడం జరిగింది. గౌరవాధ్యక్షులు షేక్ రియాజ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలవ్వడంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని, ప్రతి సభ్యుడు సమాజ అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని సూచించారు. రాష్ట్ర కోశాధికారి జి. వెంకటరెడ్డి ఆర్థిక వ్యవహారాలపై నివేదిక సమర్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సి.హెచ్. మహంతి మాట్లాడుతూ, పి.ఆర్. ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయిలో బలమైన వేదికగా ఎదుగుతోందని, ప్రతి జిల్లాలో సమస్యలను రాష్ట్ర స్థాయికి చేర్చి పరిష్కరించడమే అసోసియేషన్ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో సభ్యులు తమ సూచనలు, అభిప్రాయాలు తెలియజేశారు. సమావేశం ముగింపులో విజయనగరం జిల్లా కమిటీ తరపున రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

విశాలాంధ్ర-శృంగవరపుకోట: సమాచార హక్కు చట్టం దినోత్సవం సందర్భంగా ఎస్.కోట పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో సమాచార హక్కు చట్టంపై ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని సమాచార హక్కు చట్టం జిల్లా సమన్వయ కమిటీ మెంబర్ డి సూర్యారావు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత 5000 పైచిలుకు చట్టాల్లో ఇది గొప్ప చట్టమని పేద సామాన్యుడు చేతిలో బ్రహ్మాస్త్రమని అవినీతి కుంభకోణాలు వెలికి తీయడంలో మేలు బంతి చట్టమని ఈ చట్టం రావడం కోసం అనేకమంది మేధావులు దశాబ్దం నర కాలం పాటు పోరాడితే వచ్చిన చట్టమని దేశంలో ఉన్న ప్రజల్ని యజమాని స్థానంలో నిలబెట్టడానికి వచ్చిన చట్టం అనడానికి ఎందుకు దేనికి అని అడగకుండా రాయడం చదవడం రాని పౌరులు కూడా ప్రభుత్వంలో జరుగుతున్నది తాను తెలుసుకోవాలనుకున్నది పైసా కట్టకుండానే తాను కోరుకున్న సమాచారం పొందే హక్కు ఈ చట్టం కల్పించిందని అధికారి గాని తాను కోరుకున్న సమాచారం 30 రోజుల్లో ఇవ్వనట్లయితే తదుపరి ప్రతి ఒక్క రోజుకి 250 రూపాయలు చొప్పున 25 వేల వరకు జరిమానా విధించి దానిని దరఖాస్తుదారునికి అందించే గొప్ప చట్టమని అన్నారు ప్రభుత్వాలు ఈ చట్టం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంలో నిద్రవస్థలో ఉన్నాయని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో లక్షల కొలది దరఖాస్తులు సమాచార కమిషనర్ దగ్గర పెండింగ్ లో ఉన్నాయని దీనికి కారణం చట్టం సూచించిన విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన కమిషనర్ తో పాటు పదిమంది కమిషనర్లను నియమించాల్సి ఉండగా రెండు దశాబ్దాలు అవుతున్న నేటికీ జరగడం లేదని ప్రభుత్వ పాలనలో పారదర్శకత జవాబుదారితనం పెంచి దాపరికాన్ని అవినీతిని పారద్రోలి అభివృద్ధిని కోరుకున్నచట్టమని అన్నారు ఈ కార్యక్రమానికి గ్రంథాలయ అధికారి డి శ్రీధర్ సీనియర్ జర్నలిస్ట్ పి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు .